సాక్షి
నారాయణపేట
శుక్రవారం : 5 : జనవరి : 2024



మైసమ్మ ఉత్సవాలు

పర్వతాపూర్ మైసమ్మ ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి.

వివరాలు 8లో ▸



అక్రమాలు, దౌర్జన్యాలు

బీఆర్ఎస్ పాలనలో అక్రమాలు, దౌర్జన్యాలు సాగాయని మంత్రి జూపల్లి ఆరోపించారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.2 /15.8

వాతావరణం

ఉదయం, రాత్రి వేళ చలి తీవ్రత అధికంగా ఉంటుంది. అప్పుడప్పుడు చల్లటి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఊట్కూర్‌లో కరోనా పాజిటివ్ కేసు నమోదు

ఊట్కూర్: **మండల కేంద్రంలో గురువారం ఒక కరోనా పాజిటివ్ కేసు నమోదైనట్లు డాక్టర్** భవాని తెలిపారు. బాధితురాలు వారం రోజుల క్రితం బెంగళూరుకు వెళ్లి వచ్చిందని, ఎంతకూ దగ్గు, జ్వరం తగ్గకపోవడంతో గురువారం సాయంత్రం ఆస్పత్రికి వచ్చిందని తెలిపారు. అనుమానం వచ్చి కరోనా పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ అని తేలిందని, బాధితురాలని హోం క్వారంటైన్ ఉండాల్సిందిగా సూచించామని పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగాలకు దరఖాస్తులు

నారాయణపేట రూరల్: పోలీసు భరోసా సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ సెంటర్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి నాలుగు పోస్టులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. కౌన్సిలర్ కమ్ సెంటర్ కో ఆర్డినేటర్‌కు సైకాలజీలో మాస్టర్ డిగ్రీ, కౌన్సెలింగ్‌లో రెండేళ్ల అనుభవం, 25 ఏళ్ల పైబడిన వారు అర్హులని, లీగల్ సపోర్ట్ పర్సన్‌కు ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పూర్తి చేసి రెండేళ్ల ప్రాక్టీస్ అనుభవంతో పాటు పది కేసులు పరిష్కరించి ఉండాలని తెలిపారు. మరో రెండు పోస్టులకుగాను విద్యార్హతతో సంబంధం లేకుండా ఏడాది పాటు బాలల హక్కుల రక్షణ, పిల్లల రక్షణ రంగంలో ఏడాది అనుభవం, 25 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉన్న వారు అర్హులని, ఈ నెల 12లోపు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లతో జిల్లా పోలీసు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

గడువు పొడగింపు

గద్వాల న్యూటౌన్: టీ–నేతన్న యాప్‌లో చేరి, వివరాల నమోదు చేసుకునేందుకు ఈనెల 15వ తేదీ వరకు గడువు పొడగించినట్లు జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ గోవిందయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నేత వృత్తిపై ఆధారపడిన అర్హులైన చేనేత కార్మికులు, అనుబంధ కార్మికులందరి వివరాలు సేకరించేందుకు గాను టీ–నేతన్న యాప్‌ను ప్రభుత్వం ప్రారంభించిందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే వివిధ పథకాలు పొందేందుకు మొబైల్ యాప్ ఒక ముఖ్యమైన వేదికగా పనిచేస్తుందని, పలు ప్రయోజనాలను పొందేందుకు అర్హులైన చేనేత కార్మికులు, అనుబంధ కార్మికులు టీ–నేతన్న యాప్‌లో యాప్‌లో తమ తమ రిజిస్ట్రేషన్లు తప్పకుండా పూర్తి చేయాలని కోరారు.

యూఎల్‌బీ ప్రత్యేక అధికారిగా శ్రీధర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: 'ప్రజాపాలన'కు వస్తున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయడానికి, వాటి పరిశీలనకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 19 మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారి నియమితులయ్యారు. అర్బన్ లోకల్ బాడీస్ (యూఎల్‌బీ) ను మాత్రమే పర్యవేక్షించేందుకు సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ పి.శ్రీధర్ స్పెషల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

ఆర్టీసీ అద్దె బస్సుల సమ్మె తాత్కాలికంగా వాయిదా

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ అద్దె బస్సుల సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఆర్టీసీ హైర్ బస్సు ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నర్సింహులు, జిల్లా జాయింట్ సెక్రటరీ రాజేశ్వర్‌రెడ్డి, సభ్యులు ఖాజా అజీమొద్దీన్, ఎంఎ రషీద్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్‌తో అద్దె బస్సుల ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధుల సమావేశం జరిగిందన్నారు. అద్దె బస్సుల ఓనర్స్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. అంతకుముందు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సమస్యలను విన్నవించగా ఆయన కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈనెల 10వ తేదీ వరకు సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినందుకు రవాణాశాఖ మంత్రి, ఆర్టీసీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు.

నేడు పీయూ క్రికెట్ జట్టు ఎంపికలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నేడు పాలమూరు యూనివర్సిటీ క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు పీడీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పీయూలో పీజీ కళాశాల మైదానంలో ఎంపికలు జరుగుతాయని, విద్యార్థుల తమ బోనఫైడ్‌తో పాటు సొంత కిట్‌ను వెంట తీసుకుని ఉదయం రావాలని తెలిపారు.

కంది క్వింటా రూ.8,609

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో గురువారం జరిగిన ఈనామ్ టెండర్లలో కందుల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.8,609, కనిష్టంగా రూ.8,314గా నమోదయ్యాయి. సీజన్ తగ్గడం వల్ల మార్కెట్‌కు వంద బస్తాల అముదాలు అమ్మకానికి వచ్చాయి.

అర్చకులకు వేతనాలేవి?

ఎన్నికల కోడ్ నుంచి అందని 'డీడీఎన్ఎస్' నిధులు

- ధూపదీప నైవేద్యాలకు తప్పని తిప్పలు
- భక్తుల సహకారంతోనే పూజా కార్యక్రమాలు
- జిల్లాలో ధూపదీప నైవేద్య పథకం కింద 180 ఆలయాల ఎంపిక



చిత్తనూర్ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



పెద్దకడ్మూర్‌లో ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నర్వ: ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా ధూపదీప నైవేద్య పథకం (డీడీఎన్ఎస్) కింద ఎంపిక చేయబడిన ఆలయాలకు కొన్ని నెలల తరబడి నిధులు విడుదల కాకపోవడంతో అటు అర్చకులు.. అర్చక ఉద్యోగులు.. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌లోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు ఆయా ఆలయాల్లో పూజ్యాదికైంకర్యాలు నిరంతరం కొనసాగేందుకు సరిపడా నిధుల్లేక ఆటంకం ఏర్పడింది. గత ప్రభుత్వం పురాతన ఆలయాల పునరుజ్జీవానికి దూపదీప నైవేద్య పథకాన్ని (డీడీఎన్ఎస్) తీసుకొచ్చింది. ఈమేరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధితో పాటు ఎంపిక చేయబడిన డీడీఎన్ఎస్ అర్చకులకు రూ.10 వేలు వేతనం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. కానీ పెంచిన వేతనాలతో పాటు, గత వేతనాలు కూడా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 800 పైచీలుకు, నారాయణపేట జిల్లాలో 180 ఆలయాల్లోని అర్చకులకు అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీడీఎన్ఎస్‌తో ఆలయాలకు పునరుజ్జీవం

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత దూపదీప నైవేద్య పథకాన్ని (డీడీఎన్ఎస్) గత ప్రభుత్వం తీసుకొచ్చింది. అప్పట్లో ఈ పథకం ద్వారా జీఓ నెంబర్ 193 ప్రకారం సెప్టెంబర్ 5న, అధికారికంగా జిల్లాలోని 68 ఆలయాలను ఈ పథకానికి ఎంపిక చేసింది. ఈ పథకం ద్వారా గత రెండు ఫేస్‌లలో అనేక పురాతన ఆలయాలకు వర్తింప చేసి ఆలయాల్లో పూజ్యాదికై ంకర్యాలు నిరంతరం కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. ఈ పథకం ద్వారా ధూపదీప నైవేద్యం కోసం ఆలయాలకు ఎంపికైన అర్చకులకు అధికారిక ఉత్తర్వులను దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ అర్చకులకు అందించి కైంకర్యాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటారు. గత ఏడాది మరిన్ని ఆలయాలకు డీడీఎన్ఎస్ పథకం వర్తింప చేసేందుకు గతంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రత్యేక నోటిఫికేషన్‌ను విడుదల చేసి 2023 జూన్ 17న జిల్లాలోని 80 ఆలయాలకు డీడీఎన్ఎస్ పథకాన్ని వర్తింపచేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం జిల్లాలోని ఎంపికైన ఆలయాలకు అప్పటి ఎమ్మెల్యేల చేతుల మీదుగా నియామక ఉత్తర్వులను దేవాదాయ శాఖ అధికారులు అందించారు.

ఉత్తర్వులు అందినా.. వేతనాలు అందలే..

ఈ నేపథ్యంలో జిల్లాలోని అర్హత కలిగిన ఆలయాలకు డీడీఎన్ఎస్ పథకం వర్తింపచేయడంతో పాటు అర్చకులకు నియామక పత్రాలు అందడంతో వారు సంబరపడ్డారు. కానీ, 6 నెలలు గడిచినా ఒక్క వేతనం కనులారా చూడలేదని వారు వాపోతున్నారు. జిల్లాలో 80 ఆలయాలు మూడో ఫేస్‌లోవి, మిగిలిన ఆలయాలు 65 ఒకటి రెండో ఫేస్‌వి మొత్తం ఆలయాలకు వేతనాలు, దూప దీప నేవద్యం కొరకు నిధులు అందక అవస్థలు పడుతున్నామంటున్నారు.

తొలి వేతనం కూడా అందలే..



అతిపురాతనమైన పెద్దకడ్మూర్ బాలబ్రహ్మేశ్వర ఆలయం మూడో విడతలో డీడీఎన్ఎస్ పథకానికి ఆరు నెలల క్రితం ఎంపికై ంది. నేటికి తొలి వేతనం అందలేదు. సొంత డబ్బుతో పూజలు నిర్వహిస్తున్నా. ప్రభుత్వం దూప దీప నైవేద్యానికి లోటు లేకుండా నిధులు మంజూరు చేసి వేతనాలు అందించాలి.

– తంబలి నర్సింహయ్య, అర్చకుడు, బాలబ్రహ్మేశ్వర ఆలయం పెద్దకడ్మూర్, నర్వ మండలం

గ్రామస్తుల సహకారంతోనే పూజలు

కొన్నేళ్లుగా ఆంజనేయస్వామి ఆలయంలో గ్రామస్తుల సహకారంతో పూజాది కై ంకర్యాలను చేపడుతున్నాను. మూడో విడతలో ఈ ఆలయం డీడీఎన్ఎస్‌కు ఎంపికైంది. నెలలు గడిచినా వేతనాలు అందలేదు. ఇటీవల కొలువుదీరిన కొత్త ప్రభుత్వమైనా నిధులు విడుదల చేయాలి.

– మల్లేష్, అర్చకుడు, చిత్తనూర్ గ్రామం

ఎన్నికల కోడ్‌తో ఆలస్యం..



డీడీఎన్ పథకం ద్వారా జిల్లాలోని ఆలయాలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను నిధులు విడుదల కాగానే అందించేందుకు చర్యలు తీసుకుంటాం. ఎన్నికల కోడ్ కారణంగా కాస్త ఆలస్యం అయ్యింది. నిధులు విడుదలతో పెండింగ్ వేతనాలు అందిస్తాం. పాత, కొత్త వేతనాలు అందించేందుకు ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

– శ్రీనివాస్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్, నారాయణపేట

ధూపదీప నైవేద్య పథకం ద్వారా నిధులు

డీడీఎన్ పథకం ద్వారా గత ప్రభుత్వాలు ఆలయాలకు కేవలం రూ.2500 మాత్రమే చెల్లించే వారు. ఈ పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం మార్పు చేసి రూ. 2500 నుంచి రూ.6వేలకు, ఆ తర్వాత రూ.6 వేల నుంచి రూ.10 వేలకు పెంచింది. ఇందులో అర్చకునికి రూ.6 వేలు, పూజాది కార్యక్రమాలను నిర్వహించేందుకు రూ.4 వేలు వెచ్చించాలని అర్చకులకు ఇచ్చిన అధికారిక నియామక పత్రంలో సూచించారు. అదే విధంగా ఆయా ఆలయాల ఆవరణలో భక్తులకు కనిపించేలా ధూపదీపనైవైద్య పథకం విధివిధానాలు, సూచనల బోర్డులను ఉంచారు. దీనిని గమనించాలని సూచనలు ఉండడంతో అర్చకులకు భక్తుల నుంచి వచ్చే పూజ్యాదిద్రవ్యాలు నిలిచిపోయి సొంత డబ్బులతో పూజలు నిర్వహిస్తున్నారు. ఈ పథకం ద్వారా ఎంపికైన ఆలయాలకు అర్చకుల ఖాతాల్లో ప్రతి నెల రూ.10 వేలు ఎండోమెంట్ శాఖ జమచేస్తోంది. ఖాతాల్లో జమ అయిన సొమ్ముతోనే ఆలయాల్లో పూజ్యాదికైంకర్యాలు అర్చకులు నిర్వహించాల్సి ఉంటుంది.

ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోవాలి



జిల్లా కేంద్రంలో ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

- అలసత్వం వహిస్తే చర్యలు
- ఉద్యానవన శాఖ అధికారులు, సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం

నారాయణపేట: శాఖపరంగా నిర్దేశించిన లక్ష్యాన్ని నిర్లక్ష్యం వహిస్తే విధుల నుంచి తొలగించాల్సి వస్తుందని కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఉద్యానవన శాఖ అధికారులు, ఉద్యోగులను హెచ్చరించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఉద్యనవన శాఖ అధికారుల సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఆయిల్‌పామ్ తోటల పెంపకంలో జిల్లాకు నిర్దేశించిన 6 వేల ఎకరాల లక్ష్యానికి కనీసం 2వేలు చేరుకోలేదంటే ఇంతకీ మీరు ఏం చేస్తున్నారని కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. సమీక్షలో ఇస్తున్న నివేదికలకు క్షేత్రస్థాయిలో జరిగిన పనులకు పొంతన లేకుండా పోతుందన్నారు. ఇలాంటి పొంతన లేని నివేదికలు ఇస్తే ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులకు నేను సమాధానం చెప్పాలా అంటూ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు మీరు సిబ్బందితో సమీక్షలు జరపడం లేదా అని జిల్లా ఉద్యానవన శాఖ అధికారిని కలెక్టర్ ప్రశ్నించారు. తమకు స్టాఫ్ కొరత ఉందని అధికారి తెలపడంతో కథలు చెప్పవద్దని, ఉన్న స్టాఫ్ ఎవరూ పనిచేయడం లేదన్నారు. కొత్త స్టాఫ్ కావాలని రిటర్న్‌గా తనకు ఓ లెటర్ ఇస్తే వాళ్ల వేతనాలు నిలిపి వేస్తానని కలెక్టర్ ఆగ్రహించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్, ఉద్యానవనశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను సిద్ధం చేయాలి..

మరికల్: రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని తప్పులు సవరించి ఓటర్ జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మరికల్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటుహక్కును సద్వినియోగం చేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని, ఒకరి పేరుమీద రెండు ఓట్లు ఉన్నా..ఇటీవల మృతిచెందిన వారి పేర్లను తొలగించాలని సూచించారు. కార్యాలయ రికార్డులను పరిశీలించారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాల అవరణలో మన ఊరు మన బడి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఆర్ఐలు శ్రీశైలం, సుధాకార్‌రెడ్డి, గోపాల్‌రావు పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతం..

కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో తహసీలార్దతో మాట్లాడారు. ఓటర్ల నమోదు కోసం వచ్చిన దరఖాస్తులు అన్నింటిని తహసీల్దార్లు 6వ తేదీ నాటికి ఆర్డీఓ కార్యాలయానికి పంపాలన్నారు. కొత్త పోలింగ్ కేంద్రాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని, ఈ నెల 6 తర్వాత ప్రజాపాలనను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు జిల్లాలోని అన్ని మీ సేవ కేంద్రాల ఆపరేటర్లను పిలిపించుకోవాలని కలెక్టర్ సూచించారు.

ప్రజల కోసమే 'ప్రజాపాలన'

మక్తల్: ప్రజల కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం ఏర్పాటు చేసిందని, అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం మక్తల్ మండలం సోమేశ్వర్‌బండ, మక్తల్ మున్సిపాలిటీ పరిదిదిలోని ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. 5 గ్యారెంటీ పథకాల కోసమే కాకుండా ఇతర ప్రజా సమస్యలపై ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామన్నారు. సాయంత్రం 6గంటల వరకు దరఖాస్తుదారులకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. అనంతరం సోమేశ్వర్‌బండలో పాఠశాలకు చేరుకొని విద్యార్థులకు కూడికలు, తీసివేతలు బోర్డుపై రాసి జవాబులను అడిగారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి జాన్‌సుధాకర్, బీసీ వెల్ఫేర్ అధికారి కృష్ణమాచారి, మున్సిపల్ చైర్‌పర్సన్ పావని, వైస్ చైర్‌పర్సన్ అఖిలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణాల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్

నారాయణపేట: మున్సిపాలిటీలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లాలోని నారాయణపేట, మక్తల్, కోస్గి మున్సిపాలిటీల కమిషనర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని మున్సిపాలిటీల్లో శానిటేషన్ పనులు ముమ్మరం చేసి పరిశుభ్రత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణాల్లో డ్రైనేజీలను ఎక్కడ అపరిశుభ్రంగా ఉండకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై చెత్త చెదారాన్ని వేయకుండా ప్రజలు సహకరించాలన్నారు. ఇంటికి వచ్చే వాహనాల్లో పొడి, తడి చెత్త వేర్వేరుగా వేయాలన్నారు. సేకరించిన తడి,పొడి చెత్తను డంపింగ్‌యార్డులకు తరలించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

కోస్గి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం



కలెక్టర్‌కు తీర్మాన పత్రాన్ని ఇస్తున్న కౌన్సిలర్లు

- 11 మంది కౌన్సిలర్లు తీర్మానం చేసి కలెక్టర్‌కు అందజేత

కోస్గి: నూతనంగా ఏర్పడిన కోస్గి మున్సిపల్ పాలకవర్గంలో ముసలం ఏర్పడింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్ పర్సన్ మ్యాకల శిరీషపై అవిశ్వాస తీర్మాణం చేసి కలెక్టర్‌కు అందజేశారు. 16 మంది కౌన్సిలర్లు ఉండగా 11 మంది అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. ఈ మేరకు తీర్మాణాన్ని గురువారం కలెక్టర్ శ్రీహర్షకు అందజేసి ఆమోదించాలని కోరారు. 16 మంది కౌన్సిలర్లతో ఒకరు చనిపోగా, మరొకరి సభ్యత్వం రద్దు కావడంతో 14 మందితో పాలకవర్గం కొనసాగుతుంది. అవిశ్వాసానికి మద్దతు తెలిపిన వారిలో బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన ముగ్గురు కౌన్సిలర్లు వైస్ చైర్‌పర్సన్ అన్నపూర్ణతోపాటు మాస్టర్ శ్రీనివాస్, బాలేష్ ఉన్నారు. కలెక్టర్‌కు తీర్మాణ పత్రాన్ని అందజేసిన వారిలో కాంగ్రెస్ కౌన్సిలర్లు గోవర్ధన్‌రెడ్డి, బెజ్జు సంగీత, నాగులపల్లి పద్మావతి, ఇద్రీస్, మంజుల, కస్తూరమ్మ, భాను నాయక్‌తోపాటు స్వతంత్ర అభర్థిగా గెలుపొందిన ఎల్లమ్మ ఉన్నారు.

అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన బ్రెయిలీ



మహబూబ్‌నగర్ రూరల్: స్పర్శ ద్వారానే అక్షర జ్ఞానాన్ని, ప్రపంచ జ్ఞానాన్ని తెలుసుకునే మార్గాన్ని కనిపెట్టి అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప వ్యక్తి లూయిస్ బ్రెయిలీ అని స్త్రీ, శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి జ్యోతి అన్నారు. లూయిస్ బ్రెయిలీ 215వ జయంతి సందర్భంగా స్థానిక టీఎన్జీఓ భవనంలో బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంధులు బ్రెయిలీని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. లూయిస్ స్పూర్తితో ఎంతోమంది అంధులు జీవితంలో గొప్పగొప్ప ఎన్నో మైలురాళ్లను దాటారని అన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, సీడీపీఓలు కె.రాజేశ్వరి, ఎల్.శాంతిరేఖ, శైలాశ్రీ, మెహరునిస్సాబేగం తదితరులు పాల్గొన్నారు.

ఎంబీఏ పరీక్ష ఫీజులు తగ్గించాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనిర్సిటీ పరిధిలో ఎంబీఏ ఫీజులు తగ్గించాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ గిరిజ, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డికి నాయకులు వినతిపత్రం అందజేశారు. అధిక ఫీజులు ఉండడం వల్ల విద్యార్థులు చెల్లించే పరిస్థితి లేదని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు అర్జున్, శ్రీధర్, సృజన, జైపాల్, నీరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

మహిళా - శిశు సంక్షేమానికి పెద్దపీట



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట: జిల్లాలో మహిళా శిశు సంక్షేమానికి అధికారులు, సిబ్బంది కలిసి సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాలరక్షభవన్‌లో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలను జిల్లాలో పూర్తిగా నివారించాలని, చైల్డ్ హెల్ప్ లైన్‌ల పై ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామం, మున్సిపాటిలోని అన్ని వార్డులో చైల్డ్, షీటీం హెల్ప్ లైన్‌ల నంబర్లు ప్రచార బోర్డులు పెట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. పట్టణంలో నిర్వహిస్తున్న ప్రీ స్కూల్ నిర్వహణ బాగుందని, మరిన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అంగన్వాడీ ప్రీ స్కూళ్లను మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని, అందుకు తన వంతు సహకారం అందిస్తామన్నారు. అంతకుముందు సీడబ్ల్యూసి అధికారి వేణుగోపాల్ జిల్లా మహిళా శిశు వికలాంగుల వయోవృద్ధుల శాఖ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. వాటిలో ప్రధానంగా జిల్లాలోని నారాయణపేట, మక్తల్, మద్దూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టుల వివరాలు, వాటి పనితీరును తెలిపారు. అంతకుముందు సివిల్‌లైన్స్‌లోని అంగన్వాడీ ప్రీ మోడల్ స్కూల్‌ను ఎమ్మెల్యే సందర్శించి పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే పట్టణంలోని సఖి (వన్ స్టాప్) సెంటర్‌ను పరిశీలించి అక్కడ పనిచేసి సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే, అనాథ, వయో వృద్ధుల కేంద్రాన్ని పరిశీలించారు. బాలసదనంలోనే అనాధ బాల బాలికలతో కలిసి ఎమ్మెల్యే పర్ణికరెడ్డి సహపంక్తి భోజనం చేశారు.

సమస్యలు తెలుసుకునేందుకు మార్నింగ్ వాక్



మార్నింగ్‌వాక్‌లో ప్రజలతో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

నారాయణపేట: జిల్లా కేంద్రమైన మున్సిపాలిటీలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు మార్నింగ్ వాక్ చేపట్టినట్లు ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. గురువారం వెంకటేశ్వర కాలనీ, గాంధీ నగర్‌లో మార్నింగ్ వాక్ చేపట్టారు. కాలనీల్లో స్వయంగా ఇంటింటికి వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. వార్డులో పారిశుద్ధ్యం లోపించిందని వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దశలవారీగా రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందెఅనసూయ, కౌన్సిలర్లు సలీం, జయశ్రీ, కమిషనర్ సునీత, ఇంజినీర్ మహేశ్, నాయకులు బండి వేణుగోపాల్, మనోహర్ పాల్గొన్నారు. ఇదిలాఉండగా, స్థానిక సీవీఆర్ భవన్‌లో ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికరెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి స్వయంగా సమస్యలను తెలుసుకొని వినతులను స్వీకరించారు.

క్లుప్తంగా

మహిళపై యాసిడ్ దాడి

- భూ వివాదాలే కారణమంటున్న గ్రామస్తులు


చికిత్స పొందుతున్న కవిత

కృష్ణా: మండలంలోని ముడుమాల్‌లో కవిత అనే మహిళపై అదే గ్రామానికి చెందిన మడుగు వెంకటేశ్ బుధవారం రాత్రి యాసిడ్‌తో దాడి చేసినట్లు ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు. కళ్లు, తలపై యాసిడ్ పడటంతో ఆ భాగంలోని చర్మం కందిపోయి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. కొంతకాలంగా ఇరు కుటుంబాల మధ్య భూ వివాదం కొనసాగుతుందని.. ఆమె, భర్త కృష్ణారెడ్డి ఇంట్లో ఉండగా రాత్రి 10 గంటల సమయంలో యాసిడ్‌తో దాడి చేశారని, భర్త ఫిర్యాదు మేరకు వెంకటేష్‌తో పాటు వెంకటపతిరాజు, శివరామరాజు, రాఘవేంద్ర చౌదరి, మరో వ్యక్తి దాడికి సహకరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలిని చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించి కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మృతదేహం లభ్యం

గద్వాల క్రైం: ప్రమావశాత్తు సంగాల చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైనట్లు రూరల్ ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. గద్వాల మండలం సంగాలకు చెందిన కుర్వ చిన్న కిష్టన్న (45) బుధవారం ఉదయం గేదెలను తీసుకుని చెరువు పరిసర ప్రాంతాల్లోకి వెళ్లాడు. నీళ్లు తాగేందుకు గేదెలు చెరువులోకి వెళ్లాయి. గమనించిన చిన్న కిష్టన్న వాటిని బయటకు తీసుకొచ్చేందుకు చెరువులోకి వెళ్లాడు. ఈ క్రమంలో బురదలో చిక్కుకుని గల్లంతయ్యాడు. గమనించిన స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. గురువారం ఉదయం జాలర్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టగా చెరువులో మృతదేహాన్ని గుర్తించారు. కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేధింపులు తట్టుకోలేక బాలిక ఆత్మహత్య

మక్తల్: ఓ యువకుడు ప్రేమిస్తున్నానంటూ బాలికను వేధించడంతో ఆమె తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. చందాపూర్ చెందిన ఆటో డ్రైవర్ వెంకటేష్ తన ఆటోలో కూలీలను తీసుకెళ్తుండేవాడు. ఈ క్రమంలో అందులో ఓ బాలికను ప్రతి రోజు ప్రేమిస్తున్నానంటూ వేధించేవాడు. ఇది తట్టుకోలేక బాలిక బుధవారం చీరతో ఉరేసుకుంది. గురువారం బాలిక తల్లి ఫిర్యాదు మేరకు వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.

చోరీ కేసులో ఏడాది జైలు శిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: ఓ మహిళకు మోసపూరిత మాటలు చెప్పి.. పుస్తెలతాడు ఎత్తుకెళ్లిన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే.. జిల్లా కేంద్రంలోని ఎదిరకు చెందిన శాంతమ్మ గతేడాది ఏప్రిల్ 24న క్లాక్‌టవర్ సమీపంలో ఉండే కూరగాయల మార్కెట్‌కు వెళ్లింది. మిడ్జిల్ మండలం వెలుగొమ్ములకు చెందిన కావాలి లక్ష్మయ్య శాంతమ్మ వద్దకు వెళ్లి మీ మెడలో ఉన్న పుస్తెలతాడు డిజైన్ మాదిరిగా మా అమ్మకు చేయించాలి.. ఓసారి చూసి ఇస్తానని మాయ మాటలు చెప్పి పది మాసాల బంగారం పుస్తెలతాడు తీసుకుని పరారయ్యాడు. అదేరోజు బాధితురాలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు ఇవ్వగా ఎస్‌ఐ బాలకృష్ణగౌడ్ కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు గురువారం కోర్టుకు రావడంతో ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి సదరు లక్ష్మయ్యకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. కోర్టు ఆదేశాలతో వన్‌టౌన్ పోలీసులు జిల్లా జైలుకు తరలించారు.

వ్యక్తి మృతి

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణ కేంద్రంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఓ వ్యక్తి చెందాడు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మలక్‌పేటకు చెందిన జహంగీర్ వనపర్తి పట్టణంలో బిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తూ ఉండేవాడు. ఈయన గురువారం పాతబస్టాండ్ దగ్గరలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద మృతి చెంది ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. జహంగీర్ చెల్లెలు అస్రత్‌బేగంకు సమాచారం ఇవ్వడంతో ఆమె వచ్చి మృతుడికి ఎవరూ లేరని తెలిపారు. మృతిపై ఎలాంటి అనుమానం లేదని మృతదేహాన్ని తీసుకెళ్లారు.

గృహోపకరణాలు, నగదు దగ్ధం



అమ్రాబాద్: మండలంలోని మొల్కమామిడిలో కొండూరి శేఖరయ్య ఇంట్లో బుధవారం రాత్రి షాట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు, కిరాణ సరకులు, రూ. 2లక్షల నగదు కాలి బూడిదయ్యాయి. గురువారం తహసీల్దార్ శ్రీకాంత్ ఘటనా స్థలాన్ని సందర్శించి కాలిన వస్తువులు, నగదును పరిశీలించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు బాధిత కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు.

కాసులిస్తేనే లెక్క..

లేకుంటే పెండింగ్ పక్కా!

- అవినీతికి కేరాఫ్‌గా ట్రెజరీ కార్యాలయం
- ముడుపులు ఇస్తేనే బిల్లుల చెల్లింపులు
- లేకుంటే సంవత్సరాలు గడిచినా జాప్యమే..
- ఈ-కుబేర్‌కు వెళ్లిన వాటికీ పర్సంటేజీల అడ్డంకులు



➪ ఓ తహసీల్దార్‌కు కిరాయికి కారు పెట్టినా. బిల్లులు ప్రతి నెలా చేసి పంపినా. ఎస్టీఓలో చెల్లింపు చేసినట్లు చూపుతున్నా.. ఈ – కుబేర్‌లో చెల్లింపు కావడం లేదు. మాతో పాటు చేయించుకున్న కొందరికి బిల్లులు వచ్చాయి. కానీ నాకు 10 నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మా పరిస్థితి బాగోలేదని, త్వరగా చెల్లించాలని కోరినా పట్టించుకోవడం లేదు. బిల్లులో 5 శాతం లంచం ఇచ్చుకుంటే గానీ పని కాదని తేల్చిచెబుతున్నారు. నెలల పాటు బిల్లు రాకపోవడంతో బండి డీజిల్‌కు కూడా ఇబ్బంది అయితాంది.

➪ హన్వాడ మండలకేంద్రంలో ఓ పాఠశాల భవన నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లు 2023 ఫిబ్రవరి 8న జనరేట్ అయింది. పీడీ అకౌంట్ చెక్కును ఓ వ్యక్తి అదే రోజు ట్రెజరీ కార్యాలయంలో జమ చేశారు. ఇప్పటి వరకు బిల్లు చెల్లించకపోవడంతో సదరు వ్యక్తి ఆ కార్యాలయానికి 11 నెలలుగా తిరుగుతూనే ఉన్నారు. ఈ చెక్కు తర్వాత సమర్పించిన వాటికి బిల్లులు చెల్లింపులు పూర్తయ్యాయి. ట్రెజరీ కార్యాలయంలో లంచం ఇచ్చిన వారికి మాత్రమే పనిచేసి పెడుతున్నారని సదరు వ్యక్తి వాపోతున్నాడు.

...ట్రెజరీ కార్యాలయం అవినీతికి కేరాఫ్‌గా మారిందనడానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. పలువురు ఉద్యోగులు, సిబ్బంది ధనదాహం, పట్టించుకోని ఉన్నతాధికారులు వెరసి సర్కారు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ప్రభుత్వ అధికారులకు వాహనాలను అద్దెకు పెట్టిన వారు, గ్రామ పంచాయతీ వర్కర్లు, కాంట్రాక్టర్లు తదితరులు నానా తంటాలు పడుతున్నారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనంలోని ట్రెజరీ కార్యాలయంలో జరుగుతున్న ముడుపుల బాగోతంపై 'సాక్షి' ఫోకస్..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోనే ఉన్నా..

ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాల నుంచి వివిధ శాఖల పరిధిలో కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు అన్నీ ట్రెజరీ ద్వారానే జరుగుతాయి. అలాంటి ప్రధానమైన విభాగంపై నిఘా కరువైంది. నూతన కలెక్టరేట్ భవనంలో కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోనే జిల్లా ఖజానా కార్యాలయం ఉన్నా.. పర్యవేక్షణ కొరవడడంతో అవినీతికి అలవాటు పడిన అధికారులు, సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. ఒక్క ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకు తప్ప..ఏరియర్స్, డీఏ, సరెండర్ లీవ్‌లు, జీపీఎఫ్ విత్‌డ్రాలు, గ్రామపంచాయతీ చెక్కుల వంటి అన్ని రకాల చెల్లింపులకు ఎవరైనా సరే పర్సంటేజీ ప్రకారం ముట్టజెప్పాల్సిన పరిస్థితి నెలకొంది.

బిల్లులో ఐదు శాతం..

ట్రెజరీ కార్యాలయానికి సమర్పించిన బిల్లులు నెలల కొద్దీ కొకొల్లలుగా వెయిటింగ్ లిస్టులో ఉన్నాయి. ట్రెజరీ కార్యాలయం నుంచి బిల్లులు పాస్ చేసి ఈ-కుబేర్‌కు పంపాక క్యూలైన్‌లో ఉండాల్సిందే. అందరికీ ఇక్కడే ట్విస్ట్ ఎదురవుతోంది. చేసిన బిల్లులో ఐదు శాతం పర్సంటేజీ రూపంలో ఇస్తేనే బిల్లు అకౌంట్‌లో పడుతోంది. ఈ తతంగం తెలిసిన వారు ముందుగానే ఇచ్చి పనులు చేయించుకుంటున్నట్లు 'సాక్షి' పరిశీలనలో తేలింది. ఇదంతా తెలవని వారు అయోమయానికి గురవుతూ అధికారుల వద్దకు పరుగెడుతున్నారు. వారు అయితదని సమాధానం ఇచ్చి తప్పించుకుంటున్నారు. ముడుపులు ఇచ్చుకోలేని వారు నిత్యం ట్రెజరీ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు.

ఇద్దరు వసూలు.. ఆ తర్వాత పంపకాలు

ముడుపుల బాగోతానికి సంబంధించి ట్రెజరీ కార్యాలయంలో ఓ ఇద్దరు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. కిందిస్థాయి కంప్యూటర్ ఆపరేటర్, ఓ సెక్షన్ క్లర్క్ అన్నీ తామై వసూలు చేస్తున్నట్లు సమాచారం. వసూలు చేసిన మొత్తాన్ని లెక్కగట్టి.. ఇదివరకు నిర్ణయించుకున్న మేరకు వాటాల రూపంలో పంపకాలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ మేరకు కొందరు కాంట్రాక్టర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు, గ్రామ పంచాయతీ బిల్లులకు సంబంధించిన వ్యక్తులు 'సాక్షి'తో మాట్లాడారు. ట్రెజరీ కార్యాలయంలో డబ్బులు ముట్టజెబితే మళ్లీ తిరగాల్సిన పని లేదని, ఇవ్వకుంటే పని కాదని, ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ తమ పేరును గోప్యంగా ఉంచాలని కోరారు.

బిల్లులు.. పెండింగ్..

జిల్లాలోని మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర ఎస్టీఓల పరిధిలో గెజిటెడ్ కేడర్ నుంచి క్లాస్–4 వరకు మొత్తం 7,632 మంది ఉద్యోగులు ఉన్నారు. వారికి ప్రతి నెలా వేతనాల కింద రూ.12,63,01,928 చెల్లిస్తున్నారు. ఇందులో పెన్షనర్లకు రూ.6.40 కోట్లు చెల్లిస్తారు. ఈ ఏడాదిలో ఉద్యోగులకు చెందిన 6,668 సప్లిమెంటరీ బిల్లులకు రూ.41.55 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో పాటు ఇతర రకాల 2,160 బిల్లులకు గాను రూ.73.34 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఇవేకాకుండా డీటీఓ నుంచి ఈ-కుబేర్‌కు పంపిన 33,307 బిల్లులకు రూ.835 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది.

ఓ ఉద్యోగ సంఘం నేత హవా..

ఉద్యోగులకు పీఆర్సీ ఏరియర్స్‌ను 2020 నుంచి లెక్కించి 18 కిస్తుల రూపంలో ప్రతి నెలా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆరు నెలల క్రితమే బిల్లులు చేసి ఆయా శాఖల నుంచి జిల్లా ట్రెజరీకి వచ్చాయి. అక్కడ బిల్లులు పాసై ఈ-కుబేర్‌కు వెళ్లాయి. అయితే ఎవరైతే కాసులు ముట్టజెప్పుతారో వారికి ఎలాంటి అడ్డంకులు లేకుండా కిస్తీల రూపంలో చెల్లిస్తున్నారు. ముట్టజెప్పని వారిని పెండింగ్‌లో పెడుతున్నారు. జిల్లాలోని ఓ ఉద్యోగ సంఘం నాయకుడితో పాటు పలువురు ఈ-కుబేర్ అధికారులు, సిబ్బందితో కుమ్మక్కై హవా నడిపిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ పనులు చేసిన కాంట్రాక్టర్లకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లోనూ ఆయనే రాయబారాలు నడుపుతుండగా ముడుపుల బేరం మూడు పువ్వులు, ఆరు కాయల్లా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ తతంగంపై జిల్లా ఖజానా శాఖ డీడీ శ్రీనివాస్‌ను పలుమార్లు ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణ చూడలేకే ఆరోపణలు


మాట్లాడుతున్న వినోద్‌కుమార్

స్టేషన్ మహబూబ్‌నగర్: అధికారంలోకి వచ్చి నెల రోజులు కూడా కాలేదని, సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన రెండు రోజుల్లో రెండు గ్యారంటీ పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ హామీలను 420 అని బుక్‌లెట్ వేయడం సరికాదన్నారు. అధికారంలోకి కోల్పోయి బాధలో ఉన్న కేటీఆర్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం అధికారంలో వచ్చిన మీ పార్టీ పాలనలో ఏం సాధించారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న మీ ప్రభుత్వం ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసిందని విమర్శించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి మంచి స్పందన వచ్చిందన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూడలేక కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధిపొందాలనే ఉద్దేశంతో ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజా పాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. సీజే బెనహర్, సిరాజ్ ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్ పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు చేసిన వారిపై కేసు

బాలానగర్: మండలంలోని ఎక్వాయపల్లిలో బుధవారం రాత్రి గుప్త నిధుల తవ్వకంకోసం వచ్చిన నలుగురిని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. చెన్నంగులగడ్డ తండా ఎక్వాయపల్లిలో ముష్టి శ్రీనివాస్ ఇంట్లో గుప్త నిధులు తవ్వకానికి వచ్చిన ఆరుగురిలో ఇద్దరు పారిపోగా గురువారం పోలీసులు ఇతర వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పెద్ద నర్సింహ, మోహన్ గౌడ్, చిన్న నర్సింహ, దావుద్, కరీముల్లా, రాహుల్ మీరపై గ్రామానికి చెందిన భూపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నువ్వుల పంటను సాగుచేద్దాం



నువ్వుల పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: ప్రస్తుతం ఉన్న వాతావరణ ప్రతికూల పరిస్థితుల్లో రైతులు తీవ్ర నష్టాలను చవి చూస్తున్నారు. వర్షాభావ పరిస్థితులను తట్టుకోనే విధంగా ఉండే పంటల సాగుపై అన్నదాతలు దృష్టి సారిస్తున్నారు. తక్కువ నీటితో పండించే పంటల్లో నువ్వులు ప్రధానమని ఏడీఏ సక్రియనాయక్ రైతులకు సూచిస్తున్నారు. ఈ పంట తక్కువ కాలంలో, తక్కువ పెట్టుబడితో చేతికి అందుతుందని చెబుతున్నారు.

పంట కాలం–విత్తన రకాలు

నువ్వుల పంటను జనవరి ఆఖరు వరకు సాగు చేసుకునే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. హిమ, మాధవి, శ్వేత, చందన, యలమంచి రకాలు అనుకూలంగా ఉంటాయి. విత్తనం విత్తే ముందు విత్తిన 30 నుంచి 40 రోజులకు, 65 నుంచి 70 రోజులకు మూడు నీటి తడులు అవసరం ఉంటుంది.

సాగు విధానం

2 కిలోల విత్తనాన్ని 6 కిలోల ఇసుకలో కలిపి 30 సెంటీమీటర్ల ఎడంలో సాళ్లల్లో విత్తాలి. కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్ కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి.

ఎరువుల యాజమాన్యం

ఎకరానికి 4 టన్నుల పశువుల ఎరువులతో పాటు 24 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం వాడాలి.

సస్యరక్షణ

బూడిద తెగులు

మొక్కల లేత ఆకులపై తెల్లటి బూడిద పొడి మచ్చలు ఏర్పడతాయి. దీని నివారణ కోసం నీటిలో కరిగే గంధకం పొడి 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

ఆకు మచ్చ తెగులు

మొక్క ఎదిగే దశలో గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు ఆకు మచ్చ తెగులు అధికంగా వ్యాపిస్తుంది. దీని వలన ఆకులు ఎండిపోయి రాలిపోతాయి. దీని నివారణకు మాంకోజెబ్ 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి 15 రోజులు వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

వెర్రి తెగులు

పంట పూత దశలో ఉన్నప్పుడు వెర్రి తెగులు ఆశిస్తుంది. తెగులు సోకిన మొక్కల్లో పత్రాలు చిన్నవిగా మారుతాయి. పువ్వులోని భాగాలన్నీ ఆకుల మాదిరిగా మారి కాయలు ఏర్పడవు. మొక్కల ఎదుగుదల లోపించి పై భాగంలో చిన్న చిన్న ఆకులన్నీ గుబురుగా ఏర్పడి వెర్రి తల మాదిరిగా తయారవుతాయి. ఈ తెగులు దీపపు పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతాయి. దీపపు పురుగు నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

మాజీ ఎమ్మెల్యే ఆల ఇంట విషాదం

నిద్రలోనే గుండెపోటుతో సోదరుడు శశివర్ధన్‌రెడ్డి మృతి


ఆల శశివర్ధన్‌రెడ్డి (ఫైల్)

అడ్డాకుల: దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఇంట విషాదం నెలకొంది. ఆయన సోదరుడు ఆల శశివర్ధన్‌రెడ్డి(58) గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లోని ఇంటికి వచ్చిన శశివర్ధన్‌రెడ్డి సాయంత్రం పొలం వద్దకు వెళ్లి వచ్చాడు. రాత్రి ఇంట్లో భోజనం చేసి నిద్రిస్తుండగా అర్ధరాత్రి తర్వాత నిద్రలోనే గుండెపోటుకు గురయ్యాడు. తల్లి వరలక్ష్మి గుర్తించే సరికే ప్రాణాలు వదిలాడు. మృతుడికి భార్య శ్రీలత, కుమార్తె సుష్మ ఉన్నారు. అన్న మృతి వార్త తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల హుటాహుటిన హైదరాబాద్ నుంచి అన్నాసాగర్‌కు తరలివచ్చి కన్నీటిపర్యాంతమయ్యారు. గురువారం ఉదయం అన్నాసాగర్ జనసంద్రమైంది. నియోజకవర్గంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

ప్రముఖ నేతల సంతాపం

శశివర్ధన్‌రెడ్డి మృతి చెందడంతో ప్రముఖ రాజకీయ నేతలు అన్నాసాగర్‌కు తరలివచ్చి సంతాపం తెలిపారు. దేవరకద్ర, గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, డీకే అరుణ, మాజీ ఎంపీలు ఏపీ జితేందర్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, అంజయ్యయాదవ్, గువ్వల బాలరాజు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు మన్నె జీవన్‌రెడ్డి, ఏపీ మిథున్‌రెడ్డి, వాల్యానాయక్, అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి తదితర ప్రముఖులు నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేను ఓదార్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గుడిసెలు దగ్ధం

కేటీదొడ్డి: ప్రమాదవశాత్తు రెండు పూరి గుడిసెలు దగ్ధమైన ఘటన మండలంలోని శివరంగాపురంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నర్సింహులు, ఆనంద్, కుటుంబ సభ్యులు గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారు. రాత్రి విద్యుదాఘాతం కారణంగా మంటలు చెలరేగి గుడిసెలు పూర్తిగా కాలిపోయాయి. కాగా క్షేమంగా బయటపడడంతో ప్రాణనష్టం తప్పింది. ఇంట్లో ఉన్న సామగ్రితో పాటు సుమారు రూ.10 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గురువారం ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వ పరంగా బాధితులను ఆదుకోవాలని తహసీల్దార్ సరితకు ఎమ్మెల్యే ఫోన్ ద్వారా వివరించారు.


గుడిసెలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

ఆదివాసీ లంబాడీల అభ్యున్నతే ధ్యేయం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆదివాసీ లంబాడీల అభ్యున్నతే తమ ధ్యేయమని పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ఆయనను నియోజకవర్గ ఆదివాసీ లంబాడీ మహిళలు మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు తమ సంప్రదాయ వస్త్రధారణను స్థానిక శిల్పారామంలో స్టాల్స్ ఏర్పాటుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కాస్ట్యూమ్స్ డిజైన్ యూనిట్ తయారీకి ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందించాలన్నారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత యూనిట్ ప్రాజెక్టు రిపోర్టు ఇవ్వాలని, తండాలలో టూరిజం స్పాట్స్‌ను ఏర్పాటు చేయాలని గిరిజన నాయకులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ చైర్మన్ లింగంనాయక్, మండల చైర్మన్ తులసీరాం నాయక్, పట్టణ చైర్మన్ రవినాయక్, గిరిజన నాయకులు ఆర్.శేఖర్ నాయక్, కె.శేఖర్‌నాయక్, ఛత్రపతినాయక్ తదితరులు పాల్గొన్నారు. ఇక ఎమ్మెల్యేను హన్వాడ మండలం శేక్‌పల్లి గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కాగా, బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ), పీఆర్‌టీయూ టీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్లను వేర్వేరుగా ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

భక్తుల కొంగు బంగారం పర్వతాపూర్ మైసమ్మ

- పచ్చటి అడవి మధ్యలో వెలసిన ఆలయం
- నేటి నుంచి ఉత్సవాలు


మైసమ్మ దేవత


అడవి మధ్యలో పర్వతాపూర్ మైసమ్మ ఆలయం

నవాబుపేట: దట్టమైన అడవిని చీల్చుతూ మధ్యలో పాములాంటి మెలికలతో ఉన్న రోడ్డు, అడవి మధ్యలో వెలసింది మైసమ్మ దేవాలయం. పక్షుల కిలకిల అరుపుల సవ్వడులు ఇక్కడి ప్రకృతికి సొంతం. తరతరాల నుంచి కొలిచిన వారి కోరికలు తీరుస్తూ భక్తుల ఇలవేల్పుగా ఇష్టదైవంగా మారింది మైసమ్మ దేవత. మండల కేంద్రానికి, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి మార్గ మధ్యలో 9 కిలోమీటర్ల దూరంలో అడవి మధ్యలో వెలసిన పర్వతాపూర్ మైసమ్మ దేవాలయం కాకర్లపహాడ్ పంచాయతీ పరిధిలో ఉంటుంది.

ఉత్సవాలు..

5న ధ్వజారోహణ, కలశస్థాపనం, 6న సహస్రనామార్చన, అభిషేకం, 7న కవచ ధారణ, 8న అగ్ని స్థాపన, చండీహోమం, 9న బోనాలు, శకటోత్సవం, 10న మహా మంగళహారతి నిర్వహించనున్నారు.

సెంటిమెంట్ దేవత..

ఇక్కడ జిల్లా వాసులు చాలా మంది కొత్త వాహనం తెచ్చినా, కొత్త కార్యక్రమాలు ప్రారంభించాలన్నా, ఎన్నికల ప్రచారాలు సైతం ఈ దేవాలయం నుంచే ప్రారంభించటం ఆనవాయితీ. దీంతో పాటు ఆది, మంగళవారాలు వేల సంఖ్యలో భక్తులు ప్రత్యేక బోనాలు సమర్పించటం ఇక్కడ ప్రత్యేకం. దేవాలయం అభివృద్ధి చెందుతున్న తరుణంలో తాజాగా ఇతర రోజుల్లో సైతం భక్తుల సందడి నెలకొంది.

దేవాలయంలో సమస్యలు..

ప్రతి ఆది, మంగళవారాల్లో వచ్చే భక్తులు సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రధానంగా మహిళలకు మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉంది. అలాగే తాగునీటికి మరిన్ని ఏర్పాట్లు చేయాల్సి ఉంది. భక్తులకు వంటావార్పుకు కావాల్సిన సదుపాయాలు లేకపోవటంతో ప్రతి వారం చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న కొన్ని గదుల కోసం వారాల తరబడి వేచి చూడాల్సి వస్తుంది. మరిన్ని సదుపాయలు కల్పిస్తే భక్తుల సంఖ్య పెరగటంతో పాటు దేవాలయం మరింత అభివృద్ధి చెందుతుంది.

సమస్యలు పరిష్కారం కోసం కృషి



మైసమ్మ అడవిలో ఏళ్లుగా అడవీ శాఖకు, దేవాదయశాఖకు సంబంధించి భూ వివాదం ఉంది. దీంతో సమస్యలు ఉత్పన్నం అయ్యాయి. తాజాగా వివాదం పరిష్కారమైంది. దేవాలయానికి 6 ఎకరాల భూమి కేటాయించారు. దీంతో అడవిలో భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేసేందుకు అనుమతులు లభిస్తాయి. భక్తులకు మరిన్ని వసతులు అందుబాటులోకి తెస్తాం.

– కృష్ణయ్య, మైసమ్మ దేవాలయ కమిటీ చైర్మన్


దేవాలయ స్వాగత తోరణం

ముంపు ముప్పు నుంచి 'రక్షణ'

కృష్ణానది వెంబడి రిటైనింగ్ వాల్ నిర్మాణం



విజయవాడలో కృష్ణానది తీరాన పూర్తయిన రిటైనింగ్‌వాల్.. చురుగ్గా సాగుతున్న సుందరీకరణ పనులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడ నగర ప్రజలకు వరద ముప్పు నుంచి పూర్తి ఉపశమనం కలగనుంది. ఆర్టీసీ బస్టాండు నుంచి యనమలకుదురు వరకు వేలాది మంది ప్రజలకు వరద కష్టాలు తొలగనున్నాయి. ప్రకాశం బ్యారేజినుంచి 5లక్షలకు పైగా క్యూసెక్కుల నీరు దిగువకు వదిలితే దిగువ లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యేవి. ఇప్పుడు 12 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినా ఏ ఇబ్బంది లేకుండా రక్షణ గోడ నిర్మించారు. ఏపీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు నగరంలోని లోతట్టు ప్రాంతవాసుల ముంపు కష్టాలనుంచి గట్టెక్కిస్తూ కనకదుర్గమ్మ వారధినుంచి కోటినగర్ వరకు రూ. 122కోట్లతో రక్షణగోడ నిర్మించారు. తాజాగా పద్మావతి ఘాట్ నుంచి కనకదుర్గమ్మవారధి వరకు రూ. 120.82 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి.

కృష్ణలంకకు రక్షణ కవచం

విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని కృష్ణలంక ప్రాంతం కృష్ణానదికి వరదలు వచ్చినపుడల్లా ముంపుబారిన పడేది. ఇక్కడి కాలనీ వాసులందరినీ ఇతర ప్రాంతాలకు తరలించేవారు. వారం, పదిరోజుల పాటు వారంతా ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరాల్లోనే తలదాచుకునేవారు. ఈ సమస్యను ప్రత్యక్షంగా చూసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రక్షణ గోడ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కనకదుర్గమ్మ వారధి నుంచి కోటి నగర్ వరకు 1.2 కిలో మీటర్ల పొడవునా రూ.122.90 కోట్లతో పనులు పూర్తయ్యాయి. ప్రకాశం బ్యారేజీ దిగువన దాదాపు 50,000 మంది ప్రజలు నివసిస్తున్నారు. బ్యారేజీ నుంచి మిగులు జలాలు విడుదల చేసిన ప్రతిసారీ చలసాని నగర్, కృష్ణలంక, గీతానగర్, రాణిగారితోట, బాలాజీ నగర్, ద్వారకా నగర్, భ్రమరాంబపురం వంటి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యేవి. రక్షణ గోడ నిర్మాణంతో ఈ ప్రాంత వాసుల కష్టాలు పూర్తిగా తీరాయి.

బీసీల బతుకులు మారాయి

వైఎస్సార్‌సీపీ వల్లే బడుగులకు సమున్నత స్థానం

- చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో బీసీలకు ఒరిగిందేమీ లేదు
- ప్రతిపక్షాలవన్నీ మోసపు మాటలే... వాటిని ఎవరూ నమ్మొద్దు
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య స్పష్టీకరణ
- విజయవంతమైన 139 బీసీ కులాల ఆత్మీయ సమావేశం



బీసీ కులాల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య

సాక్షి, అమరావతి: సమాజంలో అన్ని విధాలుగా వెనుకబడిన తరగతుల వారికి ఈ ప్రభుత్వంలోనే సరైన న్యాయం జరిగిందని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. డబ్బు, నోరు, శక్తి, గుర్తింపు లేనివాళ్లకు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అగ్రపీఠం వేసిన ఏకైక వ్యక్తి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. జగన్ పాలనలో బడుగుల బతుకులు మారాయని, ఆయన గెలుపుతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని ఉద్ఘాటించారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం ఆధ్వర్యంలో విజయవాడలోని ఓ హోటల్‌లో 139 బీసీ కులాల ప్రతినిధులతో గురువారం బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మారేష్ అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ తన 45 ఏళ్ల బీసీ ఉద్యమ ప్రస్థానంలో ఎంతో మంది నాయకులను చూశాననీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదల మేలు కోరే జగన్ వంటి నాయకుడిని చూడలేదనీ పేర్కొన్నారు. ఆయన ఒక రాజకీయ నాయకుడిగా కాకుండా సంఘ సంస్కర్తగా అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, సామాజిక న్యాయం అందించడంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. నాలుగున్నరేళ్ల ఆయన పాలనలోనే వాస్తవ రాజ్యాధికార బదిలీ జరిగిందని స్పష్టం చేశారు. ఏ రాష్ట్రంలోనూ జరగనంత సామాజిక న్యాయం ఆంధ్రప్రదేశ్‌లో జరిగిందని చెప్పారు. సామాజిక న్యాయం కోసం, సమ సమాజం నెలకొల్పే దిశగా జగన్ పాలన కొనసాగుతున్నందున బీసీలంతా ఆయనకు మద్దతుగా నిలవాలని కృష్ణయ్య పిలుపునిచ్చారు.

బీసీలు బాగుంటే చంద్రబాబుకు కడుపుమంట

సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలోని పేదవర్గాల కడుపునిండుతుంటే చంద్రబాబు వంటి పెత్తందార్ల కడుపు మండుతోందని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా 'ఖబడ్దార్ ప్రతిపక్షాలు.. మీ మోసాలు మాకు తెలిశాయి' అంటూ కృష్ణయ్య హెచ్చరించారు. అమ్మఒడి, విద్యాదీవెన వంటి అనేక పథకాలు పెట్టి బీసీల బిడ్డలను సీఎం జగన్ చదివిస్తున్నారనీ, విదేశీ విద్య వంటి ప్రోత్సాహంతో బీసీల పిల్లలు అమెరికాలో చదువుకుంటున్నారనీ, వారి ఆర్థిక పరిస్థితులు మెరుగుపడి బీసీలు ఇప్పుడు కార్లు, విమానాల్లో తిరుగుతున్నారని చెప్పారు. పొరుగున ఉన్న ఒడిశా, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలకు వెళ్లి బీసీ బతుకులు ఎలా ఉన్నాయో చూస్తే ఏపీలో బీసీల అభివృద్ధి ఎంత గొప్పగా ఉందో తెలుస్తుందని చెప్పారు. ఇటీవల కర్ణాటకలోని బళ్లారి, తమిళనాడులోని తెలుగు వారుండే ప్రాంతంలో ఓ సమావేశానికి తాను వెళ్లినపుడు అమ్మ ఒడి, పింఛన్, విద్యా కానుక, ఆరోగ్యశ్రీ వంటి పథకాల కోసం తమను కూడా ఏపీలో కలిపితే బాగున్ను అని అక్కడివారు తనతో అన్నట్టు ఉదహరించారు. రాష్ట్రాన్ని 14 ఏళ్ళు పాలించిన చంద్రబాబు బీసీలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. ప్రతిపక్షాల మోసపు మాటలు ఎవరూ నమ్మొద్దని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్సీలు చెరొకటి

▶ మొదటి పేజీ తరువాయి

వారి పదవీకాలం 2027 నవంబర్ 30 వరకు ఉంది. అయితే వారి రాజీనామా అనివార్యం కావడంతో మండలిలో రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి.

కాంగ్రెస్ టికెట్ మైనారిటీ వర్గానికేనా?

ఈ రెండు స్థానాల కోసం అధికార, ప్రతిపక్ష పార్టీల నుంచి చాలామంది నేతలు పోటీ పడుతున్నారు. ఎన్నికల సమయంలో ఆయా పార్టీల అగ్ర నాయకులు పలువురికి ఎమ్మెల్సీ హామీలిచ్చారు. ఇప్పుడు అదే వారికి తలనొప్పిగా మారనుంది. కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉంది. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఒక్క మైనారిటీ కూడా ఎమ్మెల్యేగా ఎన్నిక కాకపోవడంతో ఆ వర్గానికి టికెట్ ఇచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సామాజిక సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని అధిష్టానం కూడా మైనారిటీల వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని అంటున్నారు. అయితే రాష్ట్రంలో పార్టీ ఎలాగైనా గెలవాలన్న ఉద్దేశంతో తమ అసెంబ్లీ స్థానాలను త్యాగం చేసిన పలువురు నేతలు కూడా ఎమ్మెల్సీ స్థానాన్ని ఆశిస్తున్నారు. కాగా ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీనిపై అధిష్టానంతో చర్చించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీ స్థానం ఆశిస్తున్న వారిలో ఇటీవల ఎన్నికల్లో ఓటమి చెందిన షబ్బీర్ అలీ, ఫిరోజ్‌ఖాన్, అజారుద్దీన్, అలీ మస్కతి, అద్దంకి దయాకర్, అందెశ్రీ, సంపత్, మధుయాష్కీ గౌడ్‌లు ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఎన్నికల పొత్తులో భాగంగా సీపీఐకి రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అయితే ఇప్పుడు ఒకే స్థానం లభించే అవకాశమున్నందున సీపీఐకి కేటాయించే అవకాశాలు తక్కువేనని అంటున్నారు.

ఎవరి త్యాగానికి ఫలితం దక్కుతుందో?

బీఆర్ఎస్ విషయానికొస్తే..అసెంబ్లీ ఎన్నికల సమయంలో పోటీ నుంచి తప్పించిన పలువురు నేతలకు ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పిస్తామని అధినేత కేసీఆర్ స్వయంగా హామీ ఇచ్చారు. స్టేషన్‌ఘనపూర్ స్థానాన్ని కడియం శ్రీహరి కోసం త్యాగం చేసిన మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, జనగాం స్థానాన్ని పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోసం వదులుకున్న ముత్తిరెడ్డి యాదగిరి, నర్సాపూర్ స్థానాన్ని సునీతా లక్ష్మారెడ్డి కోసం త్యాగం చేసిన మదన్‌రెడ్డి, కామారెడ్డిలో పార్టీ అధినేత కేసీఆర్ కోసం త్యాగం చేసిన గంపా గోవర్దన్ ఎమ్మెల్సీ స్థానం ఆశిస్తున్నట్లు పార్టీలో ప్రచారం జరుగుతోంది. అయితే అధినేత ఎవరివైపు మొగ్గు చూపుతారనేది ఆసక్తికరంగా మారింది. 119 మంది సభ్యులున్న రాష్ట్ర శాసనసభలో కాంగ్రెస్ 65 (సీపీఐ 1 కలిపి), బీఆర్ఎస్ 39, బీజేపీ 8, ఎంఐఎం ఏడుగురు ఎమ్మెల్యేల బలం కలిగి ఉన్నాయి.

రెండు ఎమ్మెల్సీ స్థానాలకు 29న పోలింగ్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల నగారా మోగింది. కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డిల రాజీనామాతో శాసనమండలిలో ఎమ్మెల్యేల కోటాలో ఖాళీ అయిన రెండు స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి కేంద్ర ఎన్నికల సంఘం గురువారం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 11వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయనుంది. 18న నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ కాగా, 19న నామినేషన్లను పరిశీలిస్తారు. 22న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. 29వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్లు లెక్కిస్తారు. ఫిబ్రవరి 1వ తేదీలోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి అవుతుందని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది.

సిరిసిల్ల నేతన్నలకు రూ.130 కోట్ల ఆర్వీఎం ఆర్డర్లు



సిరిసిల్లలోని పవర్‌లూమ్స్‌లో వస్త్రోత్పత్తి

▶ మొదటి పేజీ తరువాయి

గురువారం 'సాక్షి'కి తెలిపారు. 1.30 కోట్ల మీటర్ల వస్త్రోత్పత్తి ఆర్డర్లను సిరిసిల్ల నేతన్నలకు అందిస్తున్నామని వివరించారు. టెక్స్‌టైల్ పార్క్‌లోని ఆధునిక మగ్గాలపై షర్టింగ్ వస్త్రం, సిరిసిల్లలోని పవర్ లూమ్స్‌పై సూటింగ్, ఓసీ వస్త్రాన్ని ఉత్పత్తి చేసే ఆర్డర్లు ఇవ్వనున్నామని చెప్పారు. ఆర్వీఎం ఆర్డర్ల విలువ రూ.130 కోట్లు ఉంటుందని అంచనా.

50 శాతం కాటన్‌తో వస్త్రాల ఉత్పత్తి

గతానికి భిన్నంగా 50 శాతం కాటన్ నూలుతో కలిపి ఆర్వీఎం వస్త్రాలను ఉత్పత్తి చేయనున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ కోసం ఈ వస్త్రోత్పత్తి ఆర్డర్లను సిరిసిల్ల నేతన్నలకు అందిస్తున్నారు. వస్త్రోత్పత్తికి ముందే నూలును వార్పిన్ చేసి, సైజింగ్ చేసిన తరువాత మగ్గాలపై వస్త్రాన్ని ఉత్పత్తి చేయనున్నారు. సిరిసిల్లలో తొలిసారి ఈ ప్రయోగం చేస్తున్నారు. గతంలో ప్లెయిన్ వస్త్రాన్ని ఉత్పత్తి చేసి ప్రింటింగ్ చేయించేవారు. కానీ ఈసారి వీవింగ్‌లోనే డిజైన్లు వచ్చేలా ఉత్పత్తి చేస్తున్నారు.

'మేడిగడ్డ' కుంగుబాటుపై అధ్యయనం

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు దారితీసిన కారణాలను కనిపెట్టడానికి నీటిపారుదల శాఖ గురువారం ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ టెస్ట్ (ఈఆర్‌టీ) చేపట్టింది. వారంలోగా బ్యారేజీ కుంగుబాటు కారణాలు తెలుస్తాయని అధికారులు భావిస్తున్నారు. ఎక్స్‌రేలో ఎలా ఫలితం కనిపిస్తుందో ఈఆర్‌టీలోనూ అలాంటి ఫలితం కనిపిస్తుందని చెబుతున్నారు. గతేడాది అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాక్ పియర్లు కుంగుబాటుకు గురవగా దీన్ని గత నెల 29న మంత్రుల బృందం పరిశీలించింది. ప్రస్తుతం చేస్తున్న పరీక్షలు కొనసాగుతాయని, బ్యారేజీకి సంబంధించి మరెక్కడైనా ఇలాంటివి ఏర్పడ్డాయా అనే అంశాన్ని పరిశీలించనున్నారు. అధికారుల నివేదిక ప్రకారం 16 నుంచి 21 వరకు ఉన్న పియర్లు ప్రభావితం అయినట్లు చెబుతున్నారు. ఈ బ్యారేజీని నిర్మించిన ఎల్‌అండ్‌టీనే ఈ పరీక్షలు నిర్వహిస్తోంది. ఇక సుందిళ్ల బ్యారేజీలో సీపేజీ బయటపడటంతో ఆ రెండు చోట్ల కూడా గ్రౌటింగ్ చేశారు. అన్నారంలో నాలుగు చోట్ల సీపేజీ బుంగలు ఏర్పడగా నాలుగు చోట్ల గ్రౌటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. గ్రౌటింగ్ తరువాత ఈ రెండు బ్యారేజీల వద్ద కూడా ఈఆర్‌టీ పరీక్షలు నిర్వహించనున్నట్లు సమాచారం.

కానిస్టేబుల్ నియామకాలకు లైన్‌క్లియర్

▶ మొదటి పేజీ తరువాయి

అప్పీలు చేసింది. సింగిల్ జడ్జి అన్ని అంశాలను పరిశీలించలేదని, ఆ తీర్పును కొట్టివేయాలని కోరింది.

ఆ పని నిపుణుల కమిటీలే చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ అప్పీల్‌పై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావుల ధర్మాసనం విచారణ జరిపి తాజాగా తీర్పు వెలువరించింది. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును పక్కనపెడుతున్నట్టు పేర్కొంది. రిక్రూట్‌మెంట్ బోర్డులు నిర్వహించే నియామక పరీక్షల్లో తలెత్తే సమస్యల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకుని ప్రశ్నలు తొలగించడం సరికాదని స్పష్టం చేసింది. ఇలాంటి పనులను నిపుణుల కమిటీలే చేయాలంటూ సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావించింది. ప్రశ్నల తప్పిదాలపై ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో స్వతంత్ర కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించింది. అభ్యర్థులలో విశ్వాసం పెంపొందించేలా పారదర్శకంగా రెండు కమిటీలను ఏర్పాటు చేయాలని.. ఆ కమిటీలు ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు చేపట్టాలని నియామక బోర్డును ఆదేశించింది. ఒక కమిటీలో ఉన్న సభ్యులు మరో కమిటీలో ఉండకూడదని స్పష్టం చేసింది. నాలుగు వారాల్లోగా నియామక ప్రక్రియను పూర్తిచేయాలని పేర్కొంది.

ఎంపికైన అభ్యర్థులకు ఊరట

రిక్రూట్‌మెంట్ బోర్డు కానిస్టేబుల్ పరీక్షలకు సంబంధించి గత ఏడాది అక్టోబర్ 4వ తేదీనే ఫలితాలు ప్రకటించింది. మొత్తం 16,604 పోస్టులకు గాను 15,750 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తూ.. జాబితాను విడుదల చేసింది. ఎంపికైనవారిలో 12,866 మంది పురుషులు, 2,884 మంది మహిళలు ఉన్నారు. వారందరికీ హైకోర్టు ధర్మాసనం తీర్పుతో ఊరట లభించింది.

జాతీయ నెట్‌బాల్ పోటీల పోస్టర్ల ఆవిష్కరణ



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని డీఎస్ఏ స్టేడియంలో నేషనల్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోస్టర్లను గురువారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈనెల 13 నుంచి 16 వరకు రెండో ఫాస్ట్–5 సీనియర్ జాతీయస్థాయి పురుషుల, మహిళల నెట్‌బాల్ పోటీలు ఉంటాయని నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, విక్రం ఆదిత్య, అంజద్ తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడు ద్వారా 250 క్యూసెక్కుల వినియోగం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో గురువారం పూర్తిస్థాయి నీటి మట్టం 1,019 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 325 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. సమాంతర కాల్వ ద్వారా నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 230 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నారు.

శేఖరాచారి సూక్ష్మకళ



కల్వకుర్తిరూరల్: పట్టణంలో ఉంటున్న శేఖరాచారి మరోసారి తన సూక్ష్మకళను ప్రదర్శించారు. వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లికి చెందిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో రాగి, వెండి, బంగారు పంచలోహాలతో బతుకమ్మ, బోనం, తెలంగాణ తల్లి, తెలంగాణ తోరణం, జాతీయ జెండా, నాగలి, ఎద్దులు, రైతు, కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చిత్రం, రాహుల్ గాంధీ, సోనియా గాంధి చిత్రాలతో పాటు అమరుడైన శ్రీకాంతాచారి, ప్రొఫెసర్ జయశంకర్ ప్రతిబింబాలలను అతి చిన్నగా తయారు చేశారు. తన సూక్ష్మ కళతో చేసిన వీటిని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేస్తానని శేఖరాచారి తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలో అక్రమాలు, దౌర్జన్యాలు

- ప్రజలకు నచ్చేలా కాంగ్రెస్ పాలన
- మంత్రి జూపల్లి కృష్ణారావు



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్: సోనియాగాంధీ నాయకత్వంలో సాధించుకున్న రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని రాష్ట్ర ఆబ్కారీ, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం ఐడీఓసీ కలెక్టరేట్ ప్రజావాణి హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. తెలంగాణ అమరవీరుల ఆకాంక్ష మేరకు గడిచిన తొమ్మిదిన్నర ఏళ్ల పాలన సవ్యంగా జరగలేదని చెప్పారు. వాస్తవాన్ని నొక్కి వక్కానిస్తూ వచ్చే 5 ఏళ్లలో ప్రజల ఆలోచనలకు, ఆశయాలకు, అమరవీరుల ఆకాంక్షకు అనుగుణంగా పరిపాలన కొనసాగుతుందని తెలిపారు. ప్రజలకు సేవకులుగా ఉంటామని, నిజాయితీగా పారదర్శకమైనా పరిపాలన ఉంటుందన్నారు. గత పరిపాలనలో చాలా అక్రమాలు, వివాదాలు, దౌర్జన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా ప్రజలకు ప్రభుత్వ పరిపాలన తీరును స్పష్టంగా వివరించినట్లు గుర్తు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు సంబంధించిన తాగునీటి, విద్యా, వైద్య, ఆరోగ్య ఎస్సీ కార్పొరేషన్ శాఖలపై సమీక్ష నిర్వహించినట్లు చెప్పారు. తాగునీటికి సంబంధించి జిల్లాలో రూ.40 వేల కోట్లు ఖర్చు చేశారని, తాగునీటి సరఫరాలో అక్రమాలు చోటు చేసుకున్నాయని చెప్పారు. ప్రతి ఇంటికి సరిపడ తాగునీరు పంపిణీ చేయలేకపోయారని విమర్శించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ప్రజలకు సరైన న్యాయం చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే నిజమైన పరిపాలన కొనసాగుతుందని ప్రజలు నమ్మారని ప్రజలకు భయం పోయిందన్నారు. ఈ ప్రభుత్వం మీది, మాది, మనందరిదని తెలియజేశారు. ప్రజా సంక్షేమంపై దృష్టి సారించామన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు కాంగ్రెస్ పార్టీని కోరుకుని గెలిపించారని, ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం

- 14 అంశాల్లో విద్యార్థులలోని ప్రతిభ వెలికితీత
- ఉమ్మడి జిల్లా గిరిజన గురుకులాల రీజినల్ అధికారి నాగార్జునరావు
- ఇగ్‌నైట్ ఫెస్ట్‌లో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్‌లు

కల్వకుర్తి టౌన్: గిరిజన గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులలో దాగి ఉన్న నూతన ఆవిష్కరణలకు ఇగ్‌నైట్ లాంటి కార్యక్రమాలకు శ్రీకారం చుడతాయని ఉమ్మడి గిరిజన గురుకులాల రీజినల్ అధికారి నాగార్జునరావు అన్నారు. రెండు రోజుల పాటు ఉమ్మడి జిల్లాలోని గురుకుల పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన ఇగ్‌నైట్ ఫెస్ట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని, ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు గురువారం బహుమతులను అందజేశారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులలో దాగిఉన్న ప్రతిభతో పాటుగా, వారిలో భయాన్ని పొగొట్టి ధైర్యంగా వారి ప్రతిభను చూపేందుకు వీలవుతుందని తెలిపారు. చాలా మంది విద్యార్థులు వారు చేయాలనుకున్న ప్రయోగాలను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో కలిసి చక్కగా తీర్చిదిద్దటం వారిలోని ప్రతిభకు నిదర్శమని వారిని అభినందించారు. ప్రాచీన, నవీన పద్ధతులను అద్దం పట్టేలా విద్యార్థులు చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. రోజురోజుకు అంతరించిపోతున్న ప్రాచీన కళలను ఆయా పాఠశాలల విద్యార్థులు చాలా చక్కగా వివరిస్తూ వేసిన నాటికలు పలువురిని ఆలోచింపచేసేలా ఉన్నాయని నాగార్జునరావు తెలిపారు. ఫెస్ట్‌లో భాగంగా విద్యార్థులకు క్విజ్, ముగ్గుల పోటీలు, ఫ్యాషన్ షో, సైన్స్ ఫెయిర్, సాంస్కృతిక కార్యక్రమాలు, మాక్ పార్లమెంట్‌తో పాటుగా 14 అంశాలలో విద్యార్థులతో పలు కార్యక్రమాలను చేపట్టారు. విద్యార్థులలో దాగి ఉన్న వారి ప్రతిభను ఎప్పటికప్పుడు గుర్తించేందుకు ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ నిత్యం వారిని పర్యవేక్షిస్తూ ఉండాలని ఆర్సీఓ సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలను ఆర్సీఓ అందజేశారు.



బతుకమ్మ పాటకు నృత్యం చేస్తున్న విద్యార్థులు



గిరిజన సాంప్రదాయ నృత్యాలను చేస్తున్న విద్యార్థులు

జోగులాంబ దేవిని దర్శించుకున్న డీఐజీ



డీఐజీకి స్వాగతం పలుకుతున్న అర్చకులు

జోగులాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను గురువారం డీఐజీ లాల్ శంకర్ చౌహాన్ దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు సంకల్ప సిద్ధి గణపతికి ప్రత్యేక అభిషేకాలు, బాలబ్రహ్మేశ్వరుడికి ఏకవార రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఆలయ అర్చకులు వారికి తీర్థ, ప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో సత్కరించారు. డీఐజీ వెంట గద్వాల డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రమేష్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయిలో చాంపియన్‌గా నిలవాలి



సాఫ్ట్‌బాల్ క్రీడాకారులతో ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి తదితరులు

- జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేష్‌బాబు
- ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ ఎంపికలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌జీఎఫ్ కార్యదర్శి

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు చాంపియన్‌గా నిలవాలని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేష్‌బాబు సూచించారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో గురువారం అండర్–14 ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ ఎంపికలు నిర్వహించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని ఎంపికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ ఈ ఎంపికలకు ఉమ్మడి జిల్లా నుంచి 120 మంది బాల, బాలికలు హాజరైనట్లు తెలిపారు. త్వరలో నిజామాబాద్‌లో రాష్ట్రస్థాయి అండర్–14 సాఫ్ట్‌బాల్ పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి వేణుగోపాల్, కోచ్ సాధిక్‌అలీ, వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, రాఘవేందర్, మేరిపుష్ప, రఘు, వెంకట్, నాగమణి, సుగుణ, బాబా ఫక్రుద్దీన్, కపిల్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా కల్వకుర్తి ఎత్తిపోతల పనులు



పూర్తికాని బ్రిడ్జి నిర్మాణం

కల్వకుర్తిరూరల్: సాగునీటి కోసం పరితపిస్తున్న కల్వకుర్తి ప్రాంత రైతుల కలలు తీర్చేందుకు ప్రారంభించిన కల్వకుర్తి ఎత్తిపోతల పథకం 20 ఏళ్లుగా అసంపూర్తిగానే మిగిలిపోయింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కాల్వ పనులు వేగంగా చేపట్టారు. గుడిపల్లి గట్టు నుంచి కల్వకుర్తి మండలంలోని జంగారెడ్డిపల్లి వరకు 160 కిలోమీటర్ల కల్వ పనులు పూర్తి చేసేందుకు ఏళ్లు గడిచాయి. కాల్వలు పూర్తయినా అండర్ టన్నెళ్లు, సర్జిపుల్ కాల్వలు పూర్తి కాకపోవడంతో కంపచెట్లు మొలిచాయి. వంతెనల నిర్మాణం పూర్తి చేయకపోవడంతో రైతులకు అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కేఎల్ఐ ప్రధాన కాల్వ పనులను అండర్ టన్నెల్‌లను, డిస్ట్రిబ్యూటరీలను వెంటనే పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. ప్యాకేజీ నంబర్ 29తో పాటు డీ–63 డిస్ట్రిబ్యూటరీ కాల్వ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.